క్లుప్తంగా

శివపార్వతుల కల్యాణోత్సవం



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని పరిమాళపురంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ గణపతి ఉమామహేశ్వర దేవాలయంలో శనివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మహా గణపతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేఘన శ్రీపాద, జోషి రఘు ప్రేమ్‌చారీ, ఫౌండేషన్ సభ్యులు విద్యాధర్, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి తలుపుల అందజేత



ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి స్థానిక పెట్రోల్‌బంక్ నిర్వాహకులు లావణ్య, శివప్రసాద్‌లు తలుపులను శనివారం అందజేశారు. గర్భగుడి తలుపులు శిథిలావస్థకు చేరడంతో నూతనంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గోవర్దన్‌గౌడ్, ఉమేష్‌శెట్టి, టైలర్ శ్రీనివాస్‌గౌడ్, రాములు, పూజారి నర్సిములు పాల్గొన్నారు.

ఘనంగా దేవయజ్ఞం



ఊట్కూరు: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఊట్కూరులోని ఆర్యసమాజ్ భవనంలో శనివారం దేవయజ్ఞం నిర్వహించారు. సమాజ్ ప్రధాన్ కనకప్ప ఆర్య మాట్లాడుతూ ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు మహర్షి స్వామి దయానంద సరస్వతికి మహాశివరాత్రి రోజున జ్ఞానోదయం కలిగిందని తెలిపారు. విశ్వంలో ఉన్న మానవులందరూ వేదాలను చదవచ్చని సర్వశాస్త్రాలకు వేదాలు ఆధారమని తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు ఆర్య, పవన్‌కుమార్ ఆర్య, జ్ఞానేశ్వర్ ఆర్య, పద్మారెడ్డి, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల కొనుగోలులో అవినీతి

అమరచింత: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయా వార్డుల్లో, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్, తౌఫిక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2020, 2021, 2022 సంవత్సరాల్లో కొనుగోలు చేసిన విద్యుత్ పరికరాలు తీగలు, వీధి దీపాలు, స్విచ్‌లు, బోర్డులు, ఫ్యానులు, ట్యూబులు, వాటర్ సరఫరాకు ప్లంబింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. మున్సిపాలిటీ ద్వారా విద్యుత్ పరికరాల కొనుగోలు కోసం టెండర్ వేయకుండా బయట కొనుగోలు చేసి రూ.లక్షల్లో అవినీతి చేశారని ఆరోపించారు. వీటికి సంబంధించిన కొనుగోలు రశీదులు తమకు సమాచార చట్టం ద్వారా ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిచామని తెలిపారు.

బీటీగా మారేదెన్నడో?

అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం దక్కడం లేదు. సుమారు ఐదున్నర కిలోమీటర్ల మట్టి రహదారికి బీటీ కోసం ప్రభుత్వం పలు దఫాలుగా నిధులను మంజూరు చేయడం, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధులు సరిపోవని వెనక్కి వెళ్లడంతో పరిపాటిగా మారింది. ఇరు గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగపడే రహదారి కావడంతో దానిని బాగు చేయాలంటూ ఇరు గ్రామాల రైతులు సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యేకు వేడుకుంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టు అధిక భాగం ఇరుగ్రామాల మధ్య ఉండటంతో ఎత్తిపోతల సంఘం డైరెక్టర్లు, రైతులు రహదారిని సీసీగా మార్చమంటూ పీజేపీ అధికారులకు గతంతో విన్నవించారు. రైతుల విన్నపానికి స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చి పరిస్థితులను అంచనా వేశారు. ఇటు ఇరిగేషన్, అటు పీఆర్ అధికారులైన కచ్చ రహదాని రూపు రేఖలు మార్చాలంటూ రైతులు కోరుతున్నారు.



హర హర మహాదేవ..

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- మార్మోగిన శివనామస్మరణ
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- ఉపవాస దీక్షలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

నారాయణపేట టౌన్: పట్టణంలో శివరాత్రి సందర్భం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి జాగారణ సందర్భంగా భక్తులు భజనలు చేశారు.

మక్తల్: పట్టణంలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మల్లికార్జునస్వామి దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మాద్వార్ గ్రామంలో గట్టుతిమ్మప్ప దేవాలయ ఆవరణలో ఉన్న యల్లలింగేశ్వర మఠంలో ప్రత్యేక పూజలు చేశారు.

కోస్గి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. ముక్కంటి దర్శనం కోసం ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. పట్టణ శివారులోని తిమ్మన బావి శివాంజనేయ స్వామి ఆలయంలో రుద్రాక్షల మఠం పురోహితులు అమరలింగ స్వామి, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగాణంలోని ఇంద్రనీలేశ్వరాలయంలో అంపయ్య స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

ఊట్కూర్: మండలంలోని శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమస్తాపూర్ శివారులోని ఈడ్లూర్ దేవాలయంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు.



మక్తల్ మల్లికార్జున స్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు

నర్వ: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్వ, పెద్దకడ్మూర్, పాథర్చేడ్, రాంపూరం, లంకాల్, ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు జలంధర్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని కాచువాగు శివాలయం, నీలకంఠస్వామి దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులు స్వామి అభిషేకం, తదితర పూజలను నిర్వహించారు. రెనివట్ల, నాగిరెడ్డిపల్లి, పల్లెర్ల, నందిపాడ్, భూనీడ్, కొత్తపల్లి, నిడ్జింత తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని కంసాన్‌పల్లి రోడ్డులో ఉన్న శివాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అలాగే సోలార్‌ప్లాంట్ వద్ద ఉన్న శివాలయంలో భక్తులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైతన్య విద్యామందిర్ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు పూజలు చేశారు.



కోస్గి ఇంద్రనీలేశ్వరాలయంలో..

మరికల్: మండలంలో శనివారం ఘనంగా మహాశివరాత్రి వేడుకలను జరుపుకున్నారు. ఉపవాస దీక్షలు ఉన్న భక్తులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈడ్లూర్ శంకరలింగేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మద్దూరులో..



ధన్వాడలో ఊరేగింపు..



మరికల్‌లో..



పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో..



పేటలో జాగరణ సందర్భంగా భజనలు

మాగనూర్‌లో నేడు..



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాగనూర్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలం కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరుడి ఆలయం వేడుకలకు ముస్తాబైంది. శివరాత్రి మరుసటి రోజున ఇక్కడ వేడుకలు నిర్వహిస్తారు. శివమాలాధారులు శ్రీశైలం నుంచి వచ్చిన తర్వాత ఉపవాసదీక్షలు విరమణ చేసి వైభవంగా వేడుకలు చేస్తారు. ఈనేపథ్యంలోనే ఏర్పాట్లు పూర్తిచేశారు.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం..

మండల కేంద్రంలో ఉన్న శ్రీరామలింగేశ్వరుడి ఆలయంలోని శివలింగానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఈ శివలింగాన్ని వనవాసానికి వెళ్తూ స్వయంగా శ్రీరాముడే ప్రతిష్ఠించాడని ఇక్కడి చరిత్ర చెబుతోంది. సీతారాములు ఇక్కడే కొన్ని రోజుల పాటు పూజలు చేసినట్లు నమ్ముతారు. ఇక్కడి శివలింగానికి నిలువు నామం ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ప్రతి అమవాస్యకు ఇక్కడ పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతారు.



కొలువుదీరిన స్వామివారు (నిలువునామంతో)

ఘనంగా ఉత్సవాలు



నాగిరెడ్డిపల్లిలో కలశాలతో ప్రదక్షిణలు

మద్దూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో శనివారం ఉదయాన్నే గణపతి హోమం, రుద్రహోమం, గాయత్రి హోమంతో పాటు 108 కలశాల పూజ కార్యక్రమాలు బాలప్పస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి పల్లకీసేవా ఊరేగింపుగా గ్రామశివారులో వెలసిన సిద్దేశ్వరాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కళాకారులు అడుగుల భజనలు చేశారు. అనంతరం వేదబ్రాహ్మణుల ఆధ్వర్యంలో 108 కలశాలతో శివభక్తులు, గ్రామస్తులు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామికి కలశపూజాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. మద్దూరు, పల్లెర్ల, చింతల్‌దిన్నె, దమ్‌గాన్‌పూర్ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్య వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నట్లు గ్రామ సర్పంచ్ గోపాల్ తెలిపారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు

విగ్రహ ప్రతిష్ఠాపన పనులు అడ్డగింత

ఊట్కూర్ : మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో శివాజీ జయంతి సందర్భంగా చేపట్టిన శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన పనులను శనివారం ఎంపీడీఓ కాళప్ప అడ్డుకున్నారు. దిమ్మె నిర్మాణం పనులను నిలిపివేయించారు. గ్రామంలోని యువకులు పంచాయతీ అనుమతి తీసుకొని రైతువేదిక భవనం సమీపంలో శివాజీ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించేందుకు పనులను చేపట్టారు. కాగా విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కాళప్ప, సీఐ సీతయ్య, ఎస్ఐ రాములు ఘటనా స్థలానికి చేరుకొని సర్పంచ్ రవీందర్‌రెడ్డి సమక్షంలో పనులు నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులకు, అధికారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. గ్రామ సర్పంచ్ అనుమతులతో పనులు ప్రారంభించామని కమిటీ సభ్యులు వాదించారు. కాగా కలెక్టర్ ద్వారా అనుమతులు తీసుకొని పనులు చేపట్టాలని అప్పటివరకు పనులను నిలిపివేయాలని అధికారులు అన్నారు. దీంతో కమిటీ సభ్యులు కలెక్టర్‌తో అనుమతు వచ్చాకే పనులు చేపడతామన్నారు. నారాయణపేట కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో బాలకృష్ణ, సంజప్ప, నరేశ్, శ్రీనివాస్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

బీరప్ప స్వామికి పల్లకీసేవ



ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లి గ్రామంలో బీరప్పస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఇందులో సర్పంచ్ భారతి, సచిన్, మల్లప్ప, ఎల్లప్ప, పూజారి రాజు, సిద్దప్ప, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ఇలా.. మొక్కలు ఎదిగేది ఎలా..



అమరచింత: మండలంలోని చంద్రనాయక్‌తండాలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణలో అధికారులు అలసత్వం కనిపిస్తుంది. గ్రామానికి పది వేల మొక్కలు పెంచాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ ద్వారా ఈజీఎస్ అధికారులు ఆయా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. చంద్రానాయక్‌తండాలో నర్సరీని ఏర్పాటు చేసిన అధికారులు వాటిలో మొక్కలను పెంచాలనే విషయంపై దృష్టిని సారించలేక పోతున్నారు. విత్తనాలు ఖాళీ సంచుల్లో విత్తడం, మొలకెత్తకుంటే మరో మారు విత్తడం వంటి కార్యక్రమాలను చేపట్టలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చర్యలు తీసుకోవాల్సిన అ వసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన భక్తులు

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన శివస్వాములు శనివారం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. మండలకాలం పాటు నియమనిష్టలతో శివదీక్ష చేసి, స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో గురుస్వాములచేత ఇరుముడులను కట్టుకొన్నారు. మేళతాళాల మధ్య, కుటుంబ సభ్యులు, బంధువులు శివభక్తులను ఊరేగింపుగా సాగనంపారు. నర్సింహారెడ్డి, వెంకప్పగౌడ్, చెన్నయ్య, హన్మప్ప, భాస్కర్, విశ్వనాథ్‌రెడ్డితో పాటు మరో 25 మంది శివభక్తులు ఉన్నారు.



శ్రీశైలానికి తరలిన భక్తులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్వ: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం నర్వ ఎంపీడీఓ కార్యాలయంలో నిరసన చేపట్టి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను, శానిటేషన్ వస్తువులు, ఆదివారం సెలవుదినాన్ని, ఎనిమిది గంటల పనిదినాన్ని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు గొల్ల రాంచంద్రి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్రీడాకారులకు సామగ్రి అందజేత



క్రీడాకారులకు వాలీబాల్స్‌ను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

అమరచింత: ప్రతి నిత్యం క్రీడాకారులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించి తమ లక్ష్యసాధనలో ముందుకు సాగాలని మక్తల్ బీఆర్ఎస్ నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి నిత్యం వివిధ క్రీడల్లో పాల్గొంటూ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు మైదానంలో సరైన సౌకర్యాలు లేవనే విషయాన్ని స్వయంగా మైదాన పరిశీలనకు వెళ్లిన వర్కటం జగన్నాథ్‌రెడ్డికి క్రీడాకారులు తమ సమస్యలను తెలియచేశారు. దీంతో క్రీడాకారుల విన్నపం మేరకు స్పందించిన వర్కటం జగన్నాథ్‌రెడ్డి రూ.45 వేల వ్యయంతో నాలుగు ఎల్ఈడీ బల్బులు, 4 వాలీబాల్స్ శనివారం క్రీడాకారులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజల అవసరాలను గుర్తించి వాటిని అందించటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడం, పదో తరగతి వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించామని తెలిపారు.

సామాజిక సేవ చేయాలి

యువకులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. విద్యార్థులకు, క్రీడాకారులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులు జగన్నాథ్‌రెడ్డికి శాలువ, పూలమాలతో సత్కరించారు. తమ సమస్యను తెలుసుకొని పరిష్కరించడం ఎంతో సంతోషమన్నారు. భవిష్యత్తులో వర్కటం చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, గణేష్, బీమా, మసన్న, ప్రతీష్, దిలీప్, అజయ్, అభినయ్, స్టీవెన్, సాయి విజయ్, స్వరాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఓపెన్ జిమ్

- మరమ్మతులకు నోచుకోని వ్యాయామ పరికరాలు
- ఆసక్తి కనబర్చని స్థానికులు

నారాయణపేట : పట్టణంలో స్థానికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారుతోంది. అందులోని వ్యాయామ పరికరాలు అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో రూ.లక్షలు ఖర్చులు చేసి ఈ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అందులో వివిధ రకాల వ్యాయామ పరికరాలు ఉంచారు. జిమ్ ప్రారంభంలో ఎంతో ఆసక్తితో ఉదయం, సాయంత్రం వేళలో దాదాపు 100 మందికి పైగా యువతి, యువకులు, నడి వయసు వారు ఇక్కడకు వచ్చి వ్యాయామం చేసేవారు. కానీ కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో లాక్‌డౌన్‌లో విధించడంతో ఓపెన్ జిమ్‌ను మూసివేశారు. లాక్‌డౌన్ సడలింపుల అనంతరం తిరిగి తెరిచారు. కానీ ఇక్కడి స్థానికులు జిమ్‌కు రావడానికి ఆసక్తి కనబర్చడం లేదు. నిర్వహణ సరిగా లేకపోవడం, పరికరాలు దెబ్బతినడం, మరమ్మతులకు నోచుకోకపోవడం, వివిధ కాలనీలకు దూరంగా ఉండడం తదితర కారణాలు ప్రజలలో అనాసక్తికి కారణమవుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరైన నిర్వహణ చేపట్టేలా, పరికరాలకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఓపెన్ జిమ్





విరిగిన వ్యాయామ పరికరాలు



విరిగిన ప్రధాన గేట్

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

మరికల్: రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షులు వీరన్న అన్నారు. విలేకరులతో శనివారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రుణమాఫీ చేయడంలో విఫలమవుతుందన్నారు. ప్రకటనలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు లేక ఇంట్లోనే పత్తి నిల్వ చేసుకొంటున్నారన్నారు. ఇప్పటికైనా కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ, సూర్యమోహన్, హరీష్, మొగులప్ప, చెన్నారెడ్డి, శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.